క్లుప్తంగా

మోడల్ స్కూల్ తనిఖీ



మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రశేఖర్

బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె మోడల్ స్కూల్‌ను మంగళవారం డీవైఈఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సక్రమంగా విధులకు హాజరుకాక నిర్లక్ష్యం చేస్తోందని విద్యార్థుల తల్లితండ్రులు ఫిర్యాదు చేయడంతో విచారణ నిమిత్తం డీవైఈఓ హాజరైనట్లు ప్రిన్సిపల్ అనిత తెలిపారు. ఈసందర్భంగా డీవైఈఓ చంద్రశేఖర్ పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మంచి చదువులు నేర్పించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయురాలిపై ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని డీవైఈఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

మసీదు భూముల విక్రయాలపై ఫిర్యాదు



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇనయతుల్లాషరీఫ్

పుంగనూరు: పట్టణంలోని రాతి మసీదుకు చెందిన భూములను కొంతమంది విక్రయించడంపై ముస్లింలు సబ్‌రిజిస్ట్రార్ సర్వేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మంగళవారం రాతి మసీదు ముతవల్లి ఇనయతుల్లాషరీఫ్, మసీదు సభ్యులు సద్దామ్ ఫిర్యాదు చేశారు. ఇనయతుల్లా షరీఫ్ మాట్లాడుతూ మసీదుకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సదుం: మండలంలోని గొంగివారిపల్లె ప్రాథమిక పాఠశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పుస్తక సంక్షిప్త కేంద్రం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన వారికి కేంద్రం నిర్వాహకుడు బాలాజీ ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సరళ పాల్గొన్నారు.

మినీ గోకులాల నిర్మాణంపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

సదుం: మండలంలో మినీ గోకులాల నిర్మాణంపై ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మండలానికి 65 మినీ గోకులాలు మంజూరైనట్లు ఏడీఏ డాక్టర్ శ్రీనివాసనాయుడు తెలిపారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన కోరారు. బిల్లుల మంజూరు సమస్యలుంటే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల పశువైద్యాధికారి ప్రదీప్, ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్వేను పటిష్టంగా నిర్వహించాలి

పలమనేరు: గ్రూపు మహిళల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని అంచనా వేసేందుకు మెప్మా చేపడుతున్న ఎస్‌పీసీఐ ఇంటింటి సర్వేను పటిష్టంగా నిర్వహించాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. ఆమేరకు మెప్మా ఆర్పీలు, సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశాన్ని నిర్వహించి సర్వేకు సంబంధించిన విషయాలను చర్చించారు. పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. గంటావూరులో ఆర్పీలతో మాట్లాడుతూ గ్రూపు మహిళలు ప్రభుత్వ పథకాల ద్వారా ఎలా అభివృద్ధి చెందారో తెలుసుకునేందుకు సర్వేను చేస్తున్నామని తెలిపారు. అయితే ఈ సర్వే కారణంగా తమకు ప్రభుత్వ పథకాలు అందవని కొందరు గ్రూపుసభ్యులు ఆందోళన చెందుతున్నారు.

సేవలు అందించాలి



ఆధార్ కేంద్రంలో మున్సిపల్ కమిషనర్

పలమనేరు: అపార్ సేవలకు సంబంధించి విద్యార్థులకు ఆధార్‌లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచేసుకునేందుకు వచ్చిన వారి నుంచి నిర్ణయించిన రుసుం మాత్రమే వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. ఆమేరకు పట్టణంలోని ఆధార్ కేంద్రాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. నిర్ణయించిన గడువులోపు ఆధార్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలకు అవసరమైన సేవలను అందించాలని ఆదేశించారు.

ఈ-స్టాంప్‌లతో దోపిడీ

ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఈ-స్టాంపు నాన్ జుడిషియల్ పేపర్ల ధరలకు రెక్కలొచ్చాయి. నాలుగు రెట్ల అధిక ధరలకు విక్రయిస్తూ స్టాంపు వెండర్లు ప్రజలను దోచుకుంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపు పేపర్లు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో ఈ-స్టాంపు పేపర్లపై ఆధారపడుతున్న వినియోగదారుల అవసరాన్ని అవకాశంగా చేసుకుని తాము చెప్పిందే రేటంటూ వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు ఈ-స్టాంపు తమ పరిధిలోకి రావని చేతులెత్తేస్తుండడంతో స్టాంపు వెండర్ల దోపిడీ నాన్‌స్టాప్‌గా సాగుతోంది.

- సీఎం నియోజకవర్గంలో రూ.20 స్టాంపు రూ.80కి విక్రయం..!
- ఏజెన్సీల దోపిడీ పర్వం
- చోద్యం చూస్తున్న అధికార గణం



కుప్పం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఈ-స్టాంపు వెండర్ల వద్ద రూ.80కి కొన్న రూ.20 స్టాంపు



కుప్పం రూరల్: సంవత్సర కాలం నుంచి నాన్ జుడిషియల్ స్టాంపు పేపర్ల ధరలకు డిమాండ్ పెరిగింది. నాసిక్ నాన్ జుడిషియల్ ప్రింటింగ్ ప్రెస్‌లో సమస్యలు తలెత్తడం.. ప్రభుత్వాలు సక్రమంగా సరఫరా చేయలేకపోవడంతో వీటికి డిమాండ్ పెరిగింది. ఈ సమయంలో ప్రభుత్వం సమస్యలు తలెత్తకుండా ఈ-స్టాంపు నాన్ జుడిషియల్ పేపర్లను తీసుకొచ్చింది. దీని అమ్మకాల బాధ్యత stockholding.com అనే వెబ్‌సైట్ నిర్వాహకులకు ఇచ్చింది. ఈ కంపెనీ అన్ని ప్రాంతాల లాగే కుప్పంలో 15 మందికి అమ్మకానికి (ఏజెన్సీ) అనుమతి ఇచ్చింది. వీరు సంవత్సర కాలంగా రూ.10, 20, 50, 100 నాన్ జుడిషియల్ స్టాంపు పేపర్లు (ఈ-స్టాంపు) విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వీటి ధరలకు రెక్కలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అపార్ కార్డు రూపొందిస్తోంది. ఇందుకుగాను తప్పులు లేని బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులు కావాల్సి ఉంది. పిల్లల రికార్డుల్లో భారీగా తప్పులు నమోదయ్యాయి. వీటి సవరణ కోసం వీఆర్వో, కార్యదర్శి, మీ-సేవా సెంటర్లు లాయర్ అఫిడవిట్లు తీసుకురావాలని చెబుతుండడంతో వీటి కోసం తల్లిదండ్రులు పెద్ద మొత్తంలో నాన్ జుడిషియల్ పేపర్ల కొనుగోలు తప్పనిసరిగా చేయాల్సి వస్తోంది. మరోవైపు రైతులు తమ భూముల రికార్డుల మార్పు, ఆధార్ కార్డుల సవరణకు సైతం స్టాంపు పేపర్లు కొంటున్నారు. దీంతో ఒక్కసారిగా పెద్ద మొత్తంలో స్టాంపు పేపర్ల డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా ఈ-స్టాంపు వెండర్లు రూ.10 స్టాంపును 50కి, రూ.20ను 80కి, రూ.50ను 120కి, రూ.100స్టాంపు పేపర్‌ను ఏకంగా రూ.200లకు విక్రయిస్తూ వినియోగదారులను దోచుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే స్టాంపు పేపర్ లేదని చెప్పి పంపుతున్నారు. దీంతో చేసేది లేక వినియోగదారులు వారు చెప్పిన ధరకే కొనాల్సి వస్తోంది. ఈ దోపిడీకి చెక్ పెట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

కడా పీడీ అయినా స్పందించేనా..?

కుప్పం నాన్ జుడిషియల్ స్టాంపు పేపర్ల (ఈ-స్టాంపు)ను అధిక రేట్లకు విక్రయిస్తున్న స్టాంపు వెండర్లపై కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నాలుగు రెట్ల అధిక ధరలకు విక్రయిస్తున్న స్టాంపు వెండర్ల దోపిడీ పర్వానికి చెక్ పెట్టకపోతే నిత్యం నష్టపోక తప్పదని కుప్పం ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఈ-స్టాంపు మా పరిధి కాదు

కొంత కాలంగా నాన్ జుడిషియల్ స్టాంపుల కొరత ఉండేది. పది రోజుల క్రితం స్టాకు వచ్చింది. ఎవరు వచ్చినా ఇస్తాం. మా వద్ద ప్రతి స్టాంపు పేపర్‌పై యూజర్ చార్జీల కింద రూ.50 అధికంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ-స్టాంపు పేపర్లు మా పరిధిలోకి రావు.

-సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్, కుప్పం



గ్రంథాలయాలతో విజ్ఞానం



లక్ష్మమ్మను సన్మానిస్తున్న గ్రంథాలయాధికారి

పలమనేరు: గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు దోహదం చేస్తాయని, అధికంగా విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవాలని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశులు అన్నారు. ఆమేరకు కళాశాలలోని గ్రంథాలయ విభాగాధిపతి వెంకటసుధ ఆధ్వర్యంలో వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకతపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఈ.వాసు, నందీశ్వర్, సుధ పాల్గొన్నారు. మరోవైపు గ్రంథాలయ 57వ జాతీయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సిలక్ష్మి జయంతిని పురస్కరించుకుని రాచమొడుగు రంగయ్యశెట్టి ప్రైమరీ పాఠశాలకు స్వచ్ఛందంగా సేవలుఅందిస్తున్న లకు లక్ష్మమ్మను స్థానిక శాఖా గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్ సన్మానించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆమె పిల్లల కోసం అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు. సీతారామయ్య, నందగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దబాలశిక్ష పుస్తకాల వితరణ



పెద్దబాలశిక్ష పుస్తకాలను అందజేస్తున్న తులసినాథంనాయుడు

బైరెడ్డిపల్లె: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 300 మంది విద్యార్థులకు తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు పెద్ద బాల శిక్ష పుస్తకాలను వితరణ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సీఆర్‌సీ సమావేశంలో విరామ సమయంలో ఉపాధ్యాయులకు అందజేశారు. తెలుగు భాషాభివృద్ధి కోసం, తెలుగు ఔన్నత్యాన్ని భావితరానికి అందించడానికి అహర్నిషలు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు లక్షకుపైగా పెద్దబాలశిక్ష పుస్తకాలను వితరణగా అందజేశామని తెలిపారు. తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

108 సిబ్బంది సమ్మె నోటీస్



పలమనేరు: నిరసన తెలుపుతున్న 108 సిబ్బంది



పుంగనూరు: నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

పలమనేరు: ఈనెల 25 తర్వాత 108 సర్వీసులు నడవవని నియోజకవర్గంలోని 108 సిబ్బంది అన్నారు. ఆమేరకు పలమనేరు సిబ్బంది 108 వాహనం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మైకేల్ రాజేష్, నగ్మా, వెంకటేష్ మాట్లాడుతూ ఈ విషయమై ఇప్పటికే పలమనేరు డివిజన్‌లోని తాము ఆయా తహసీల్దార్‌లకు వినతిపత్రాలను అందజేశామన్నారు. 108 సేవలను ప్రైవేటు కంపెనీలు కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఇప్పటికే తమకు అందాల్సిన ఇంక్రిమెంట్లను అరవిందో కంపెనీ ఇవ్వలేదన్నారు. జీఓ నం:49ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు.

108 ప్రభుత్వమే నిర్వహించాలి

పుంగనూరు: ప్రజలకు అత్యవసర సేవలు అందిస్తున్న 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఆశాఖ ఉద్యోగులు మంగళవారం డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద సంఘ నాయకుడు గణేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గణేష్ మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సేవలు అందిస్తున్న తమ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులందరిని ఆదుకోవాలని కోరారు.

పట్టుదలతో కృషిచేస్తే విజయం సొంతం



మహిళలను సన్మానిస్తున్న నిర్వాహకులు

వి.కోట: ఒక లక్ష్యంతో విద్యార్థులు పట్టుదలతో కృషిచేస్తే ఎంతటి విజయాలనైనా సొంతం చేసుకోవచ్చని పలమనేరు ఎస్‌ఐ స్వర్ణతేజ తెలిపారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వాహకులు వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వర్ణతేజ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను ఈసందర్భంగా సన్మానించారు. వి.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి, మానస వికలాంగుల పాఠశాల నిర్వాహకురాలు భార్గవి, అనాథ ఆశ్రమ నిర్వాహకురాలు శాంతమ్మ పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి



ఇరిసిగానిపల్లెలో నిర్వహిస్తున్న గ్రామసభ

గుడుపల్లె: భూసర్వేలో ఇటీవల జరిగిన 17 రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన 527 అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శీతారాం అన్నారు. మంగళవారం ఇరిసిగానిపల్లెలో రెవెన్యూ గ్రామసభలు పూర్తి అయ్యాయన్నారు. గతనెల 22వ తేదీ నుంచి జరిగిన ప్రతి అర్జీదారుని వద్దకు వెళ్లి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ డీటీ ఆఫ్రీఫ్ ఆలీషా, సర్వేయర్ రత్నప్ప, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రుణాలు



రుణాలను పంపిణీ చేస్తున్న బీఎం, కమిషనర్

పలమనేరు: స్వనిధి-స్వాభిమానం కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపల్ మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని వీధి వ్యాపారులకు ఇండియన్ బ్యాంకు ద్వారా రుణాల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ పట్టణ పరిధిలోని మెప్మాలోని మహిళలకు తక్కువ వడ్డీతో వ్యాపార రుణాలను బ్యాంకులు అందిస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకొని మహిళలు వ్యాపారంలో బాగా రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు అందజేసిన డిజిటల్ లావాదేవీల క్యూఆర్ కోడ్ ప్యాడ్‌లను ఆయన మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో బీఎం అశోక్, సీఎంఎం బాబా, ఓలు జయంతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శోభ తెలిపారు. పాఠశాలలో భౌతికశాస్త్రం, జీవశాస్త్రం బోధించేందుకు ఉపాధ్యాయులు కావాలని, ఆసక్తి గల వారు ఈనెల 22 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పాఠశాలలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



కంది పంటను పరిశీలిస్తున్న అధికారులు

పులిచెర్ల(కల్లూరు): సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులులు పొందవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని దేశిరెడ్డి గారిపల్లె, వంకమద్ది వారిపల్లెల్లో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు పత్రాలు అందజేశారు. అనంతరం సాగులో ఉన్న కంది పంటను పరిశీలించారు. సిబ్బంది లీల, హేమ పాల్గొన్నారు.

సీసీఆర్సీ సెంటర్ల తనిఖీ

పలమనేరు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన సీసీఆర్సీ సమావేశాలను స్థానిక ఎంఈఓ లీలారాణి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అకడమిక్ పనులు, నాన్ అకడమిక్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిక్షకులు శ్రీనివాసులు, షంషీర్, మునాఫ్, రజాక్, గీత పాల్గొన్నారు.

సామూహిక సౌందర్యలహరి పారాయణం



పారాయణం చేస్తున్న మహిళలు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్లలో వెలసిన వైష్ణవీదేవి ఆలయంలో సామూహిక సౌందర్యలహరి పారాయణం, లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో వైష్ణవీదేవికి విశేష అలంకరణ చేశారు. మహిళల ఆధ్వర్యంలో అమ్మవారి పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవతామూర్తుల వచనాలు స్మరిస్తూ పారాయణం చేశారు. ఆలయ నిర్మాణ కర్త వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పుంగనూరు: స్థానిక లీనార్డ్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా లైబ్రేరియన్ తులసినాయక్, హెచ్‌ఎం ఉషారాణి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

చౌడేపల్లె: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం పుదిపట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్యసూత్రాలను పాటించాలని సూచించారు. రోజూ నిద్రలేచిన వెంటనే కాలకృత్యాలు తీర్చుకొని, పరిశుభ్రతను పాటించే విధానంపై అవగాహన కల్పించారు. రక్తహీనత నుంచి అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యం కల్పించారు. హెచ్‌ఎం పద్మజ, వైద్యసిబ్బంది హరి పాల్గొన్నారు.

రసాయన రహిత సేద్యమే మేలు

శాంతిపురం: రైతులు, వ్యవసాయ ఉత్పత్తుల వినియోగదారులు, పర్యావరణ హితం కోసం రసాయనాలు లేని సహజ వ్యవసాయ పద్ధతులే పాటించాలని మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం జంగాలపల్లి వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెండ, మొక్కజొన్న, మునగ తోటలను పరిశీలించి అందులో వచ్చే తెగుళ్లు, పురుగులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతు సమాచార కేంద్ర, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

యానాదులకు బర్త్ సర్టిఫికెట్ల జారీ

- నెట్టిబండ సమస్యలను పరిష్కరిస్తున్న అధికారులు
- ఆధార్‌కార్డు జారీకి చర్యలు
- ఆధార్ కేంద్రానికి ఆటోలో తరలింపు
- పక్కాగృహాల మంజూరుకు వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..



దిగువపల్లె సచివాలయం వద్ద యానాదులకు బర్త్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ హనుమంతు నాయక్

చౌడేపల్లె: కొన్నేళ్లుగా యానాదులు పడుతున్న సమస్యలను పరిష్కరించడానికి అధికారులు నెట్టిబండలోనే రెండవరోజు మంగళవారం మకాం పెట్టారు. సాక్షిలో ఈనెల 18న సోమవారం 'ఎదుగు లేని బతుకు' శీర్షికన యానాదుల సమస్యలపై ప్రత్యేక కథనం ప్రచురించడం విదితమే. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించడం, ఆయన ఆదేశాలతో మండల స్థాయి అధికారులు నెట్టిబండ యానాదుల సమస్యల పరిష్కారానికి పూనుకోవడం విదితమే. మంగళవారం తహసీల్దార్ హనుమంతునాయక్ సిబ్బందితో కలసి మరోమారు సందర్శించారు. తాగునీటి సమస్య, వీధి దీపాల సమస్యలను తీర్చారు. పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌తో కలసి తహసీల్దార్ బర్త్ సర్టిఫికెట్లను 17 మందికి పంపిణీ చేశారు. మిగిలిన వారి వివరాలు సేకరించి అవసరమైన వారందరికీ ఈ సర్టిఫికెట్లు జారీ చేసి ఆధార్, రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. అలాగే నెట్టిబండలో ఉన్న యానాదుల కుటుంబాల వారీగా వివరాలు సేకరించి పక్కాగృహాలు మంజూరు చేయడంతోపాటు పథకాల్లో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరుస్తామని చెప్పారు.

ఆటోలో ఆధార్ సెంటర్‌కు తరలింపు

దిగువపల్లె గ్రామ సచివాలయం వద్ద నెట్టిబండ యానాదులకు బర్త్ సర్టిఫికెట్లు జారీ చేసిన అనంతరం ఎంపీడీఓ లీలామాధవి ఆదేశాల మేరకు పుదిపట్లలో గల ఆధార్ కేంద్రానికి ప్రత్యేక ఆటోలో తరలించారు. పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, సచివాలయ మహిళా సంరక్షకురాలు రేణుక, వెల్ఫేర్ అసిస్టెంట్ ఆనంద్ పర్యవేక్షణలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పుదిపట్ల సచివాలయంలోని ఆధార్ కేంద్రానికి తరలించి ఆధార్ కార్డుల జారీకి చర్యలు తీసుకున్నారు. అధికారులే దగ్గరుండి సమస్యలను పరిష్కరించడంతో యానాదులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.





పుదిపట్ల ఆధార్ కేంద్రం వద్ద కార్డులు జారీ చేయిస్తున్న సచివాలయ సిబ్బంది

డయల్ యువర్ డీఎం రేపు

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో ఈనెల 21న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజర్ సుధాకరయ్య మంగళవారం తెలిపారు. డీఎం మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రజలు, ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను సెల్ నంబర్: 9100941850కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ప్రజలు అందించే సలహాలు, సూచనలు పరిగణలోనికి తీసుకుని డిపోను అభివృద్ధి పథంలో నడిపించనున్నట్లు పేర్కొన్నారు.